“ రథసప్తమిని పురస్కరించుకుని మచిలీపట్నంలోని హిందూ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం 1,320 మంది విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. ఆంధ్రప్రదేశ్ యోగాసభ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



తం సూర్యం ప్రణమామ్యహం

అర్ధరాత్రి అక్రమాలు

‘అక్రమార్జనకు సమయంతో పనేముంది.. పగలైతే అందరికీ సమాధానం చెప్పుకోవాలి.. దొంగచాటుగా వ్యవహారాలు నడపాలి.. అర్ధరాత్రయితే ఏ సమస్యా లేదు.. ఎవరికీ సమాధానం చెప్పుకోవాల్సిన పనీ లేదు..’ అనుకుంటున్న మైనింగ్ మాఫియా అక్రమ తవ్వకాలకు అర్ధరాత్రి ముహూర్తాన్ని నిర్ణయించుకుంది. పేదలకు టిడ్కో ఇళ్లు నిర్మించి ఇద్దామని గత టీడీపీ ప్రభుత్వం జక్కంపూడి, వేమవరం ప్రాంతాల్లోని భారీ గోతులను గ్రావెల్‌తో చదునుచేయగా, ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన కొందరు ఆ గోతుల్లోని మట్టిని తవ్వి తీసుకెళ్లిపోతున్నారు. పగలైతే స్థానికులు అడ్డుకుంటున్నారని.. అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా రూ.కోట్ల విలువైన గ్రావెల్‌ను మింగేస్తున్నారు.

- పగలైతే గ్రామస్థులు అడ్డుకుంటున్నారని రాత్రిపూట..!
- అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోతున్న మాఫియా
- టిడ్కో ఇళ్ల నిర్మాణం నిమిత్తం పూడ్చిన గోతులపై కన్ను
- టీడీపీ హయాంలో భారీగా గోతుల పూడ్చివేత
- అందులోని గ్రావెల్‌ను తవ్వేస్తున్న మాఫియా
- గురువారం అర్ధరాత్రి అడ్డుకున్న స్థానికులు
- లెక్కచేయకుండా తవ్వకాలు జరిపిన అక్రమార్కులు
- అధికార పార్టీ అండ ఉందని రుబాబు
- తూతూమంత్రంగా దాడులు చేసిన అధికారులు

జక్కంపూడి, వేమవరంలో నిశిరాత్రిలో అక్రమ తవ్వకాలు



గురువారం అర్ధరాత్రి వేమవరం వద్ద అక్రమ తవ్వకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలంలో టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు చదును చేసిన మట్టిని కూడా మైనింగ్ మాఫియా తన్నుకుపోతోంది. అది కూడా అర్ధరాత్రిపూట. పేద, మధ్య తరగతి వర్గాల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో జక్కంపూడి, వేమవరం కొండ ప్రాంతాల్లో టిడ్కో ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాల కోసం దిగువ ప్రాంతంలో ఉన్న గోతులను చదును చేయించారు. ఈ ప్రాంతంలో ఇళ్లు ఇంకా నిర్మించాల్సి ఉండగా, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పని చేయలేదు. పైగా గ్రావెల్‌ను తరలించుకుపోమని ఆ ప్రాంతాన్ని మైనింగ్ మాఫియాకు అప్పగించింది. మూడేళ్లుగా సాగుతున్న ఈ అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవటానికి జిల్లా యంత్రాంగానికి వెన్నులో వణుకు పుడుతోంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్లే మాఫియాకు అడ్డుచెప్పే సాహసం ఎవరూ చేయలేకపోతున్నారు. పొరుగు జిల్లాకు చెందిన ఓ మంత్రి, ఓ ఎంపీకి చెందిన అనుచరులు సాగిస్తున్న ఈ దాష్టీకాన్ని లోకాయుక్త, గ్రీన్ ట్రిబ్యునల్ కూడా చూస్తూ ఊరుకోవడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితికి చేరింది.

పగలైతే కుదరదని..

అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో స్థానిక గ్రామస్థులు మాత్రం రెండు నెలలుగా ఈ అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటున్నారు. ఫలితంగా అక్రమార్కులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో మైనింగ్ మాఫియా కూడా కొత్త ఎత్తులు వేసింది. గ్రామస్థులు అడ్డుకుంటున్నారన్న ఉద్దేశంతో రూటు మార్చింది. అందరూ గాఢనిద్రలో ఉండే సమయంలో మైనింగ్ చేపడుతున్నారు. జక్కంపూడి, వేమవరం కొండ దిగువన పేద, మధ్య తరగతి వర్గాలకు బహుళ అంతస్థుల టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు టీడీపీ హయాంలో పూడ్చిన గోతులను అర్ధరాత్రి పూట తవ్వేస్తున్నారు. అప్పట్లో వేమవరం కొండ దిగువన గోతుల్లో దాదాపు లక్ష క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను నింపి చదును చేశారు. ఈ విషయాన్ని పసిగట్టిన మాఫియా తెలివిగా ఆ గోతులను తవ్వుకోవాలని స్కెచ్ వేసింది. పగలంతా గ్రామానికి శివారున తోటల్లో ఎక్స్‌కవేటర్లను దాచి, అర్ధరాత్రి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మెండెం జమలయ్య నేతృత్వంలోని

గ్రామస్థులు అడ్డుకున్నా బేఖాతరు

స్థానికులు కొందరు గురువారం అర్ధరాత్రి వేమవరం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ గతంలో పూడ్చిన గోతులను తవ్వి లారీల్లోకి ఎక్కిస్తుండటాన్ని గుర్తించారు. వేమవరం కొండగట్టు ప్రాంతంలో నాలుగు భారీ ఎక్స్‌కవేటర్లతో గోతులను తవ్వేసి, భారీ టిప్పర్లలోకి మట్టిని లోడ్ చేస్తుండటాన్ని వారంతా చూశారు. ఒక్కో మిషన్ దగ్గర పది లారీలు, దాదాపు 50కు పైగా పెద్ద టిప్పర్లు వరుసలో ఉంచడానికి గుర్తించారు.

స్థానికంగా గ్రామస్థులు అడ్డుకున్నా మైనింగ్ మాఫియా ప్రతిఘటించింది. ఎక్స్‌కవేటర్లను ఆపేందుకు ఎంత ప్రయత్నించినా ఖాతరు చేయలేదు. అక్రమ మైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన త్వరలో తనిఖీలు కూడా చేస్తారని హెచ్చరించినా వినలేదు. ‘నువ్వు కలెక్టర్‌కు చెబితే మేము ప్రభుత్వానికి చెప్తాం. మా వెనుక మంత్రులు ఉన్నారు.’ అంటూ రుబాబు చేశారు. దీంతో స్థానికులంతా చేష్టలుడిగి చూడటం తప్ప తవ్వకాలను అడ్డుకోలేకపోయారు. వీడియోలు తీసి మైనింగ్ అధికారులకు పంపించారు.



తవ్వకాలను చూపిస్తున్న స్థానికుడు మెండెం జమలయ్య

పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

అర్ధరాత్రుళ్లు మైనింగ్ జరుగుతున్న వ్యవహారాన్ని స్థానికులు.. రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా వారు పట్టించుకోలేదు. స్థానిక ఆర్ఐ హరీష్ స్పందించలేదు. మైనింగ్ డీడీ, ఏడీ సెలవులో ఉన్నారు. వీరు సెలవు పెట్టడానికి మైనింగ్ మాఫియానే కారణమని తెలుస్తోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు.. తమ సిబ్బందిని పంపిస్తామని చెప్పిన అధికారులు కొన్ని గంటల తర్వాత వేమవరం కాకుండా వేరే ప్రాంతానికి పంపించారు. రెవెన్యూ అధికారుల అలెర్ట్ వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందుకున్న మైనింగ్ మాఫియా ఆ సమయంలో తవ్వకాలు ఆపింది. మైనింగ్ సిబ్బంది వచ్చి చూసి వెళ్లిపోయారు. కళ్లెదుట వ్యవస్థలే ఇలా ప్రవర్తిస్తుంటే, తమ పోరాటం వృథానే అనుకుని గ్రామస్థులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నిర్లక్ష్యమే చిదిమేసింది..!





బ్రహ్మపురంలోని పార్కు (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన బాలుడు దినేష్ (ఫైల్)

మచిలీపట్నంలో పార్కు గేటు పడి బాలుడు మృతి

- ఐదేళ్ల కిందటే నిర్మించిన మున్సిపల్ పార్కు
- ఆ తరువాత నిర్వహణ లేక మూలకు..
- సందర్శకులు కూడా రాక శిథిలావస్థకు..
- కనీసం గేటుకు తాళాలు కూడా వేయలేని దుస్థితి
- పాఠశాల నుంచి వచ్చి పార్కుకు వెళ్లిన బాలుడు
- ఆడుకుంటుండగా గేటు మీదపడి మృతి
- బ్రహ్మపురం కాలనీలో విషాదఛాయలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అధికారుల నిర్లక్ష్యం పసిప్రాణాన్ని బలితీసుకుంది. మచిలీపట్నం బ్రహ్మపురం కాలనీలోని పార్కు గేటు పడి వడ్డీ దినేష్‌కుమార్ (9) మృతిచెందడం వెనుక మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. కలెక్టర్ కార్యాలయ ఆవరణ పక్కనే ఉన్న బ్రహ్మపురంలో ఈ మున్సిపల్ పార్కు ఉంది. దీనిని ఐదేళ్ల కిందట నిర్మించారు. ఆ తరువాత దీనిని పట్టించుకున్న వారు కరువయ్యారు. ఇందులోని కొంత సామాగ్రిని బయటకు కూడా తరలించేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పార్కుకు సందర్శకులు రావడమే మానేశారు. దీంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గేట్లు కూడా శిథిలావస్థకు చేరాయి. అలాంటి పార్కులోకి ఆడుకోవడానికి వెళ్లి దినేష్ మృతిచెందాడు. పార్కుకు తాళాలు వేసి ఉంచితే ఇంత ప్రమాదం జరిగేది కాదని స్థానికులు అంటున్నారు.

పసిప్రాణం విలవిల

మచిలీపట్నం బ్రహ్మపురం కాలనీలో వడ్డీ లక్ష్మీకాంత్ కుటుంబం అద్దెకు ఉంటోంది. లక్ష్మీకాంత్ కారు డ్రైవర్. వీరికి ఇద్దరు కుమారులు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన దినేష్ పక్కనే ఉన్న మునిసిపల్ పార్కులో ఆడుకునేందుకు వెళ్లాడు. పార్కు ప్రధాన గేటును పట్టుకుని ఆడుకోవడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో ఒక్కసారిగా గేటు ఒకవైపు ఉన్న భాగం ఊడి కిందపడింది. సరాసరి దినేష్ తలపై పడటంతో తీవ్ర రక్తస్రావమైంది. ఈ పార్కు కలెక్టరేట్ ఆవరణలో ఉన్న డీఈవో కార్యాలయం ఎదురుగా ఉంటుంది. అది చూసిన డీఈవో కార్యాలయ ఉద్యోగులు హుటాహుటిన సంఘటనాస్థలానికి వచ్చి, గేటు కిందపడి ఉన్న బాలుడిని బయటకు తీశారు. అప్పటికే బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే ఉద్యోగులు దినేష్‌ను మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అయితే, దినేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. తలకు బలమైన గాయమై రక్తం అధికంగా పోవడంతో బాలుడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై లక్ష్మీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి పోలీసులు తెలిపారు. రోజూ మాదిరిగానే పాఠశాల నుంచి వచ్చి, ఆడుకునేందుకని వెళ్లి విగతజీవిగా కనిపించిన తమ చిన్నారిని చూసి ఆ తల్లిదండ్రులు ఆసుపత్రిలో కన్నీటిపర్యంతమయ్యారు.



కానూరు ఉన్నత పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బిగిసిన పిడికిలి

మూడోరోజూ కొనసాగిన ఉద్యోగుల ఆందోళనలు

- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన జడ్పీ ఉద్యోగులు
- పెనమలూరు, మోపిదేవిలోనూ నిరసనలు

- 6లో..

ఉద్యోగుల ఉద్యమం రోజురోజుకూ పిడికిలి బిగుస్తోంది. ఉద్యమ శంఖారావంలో భాగంగా శుక్రవారం మూడోరోజు కూడా జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. ఏపీ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళనకు దిగారు. మోపిదేవి మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.



మొవ్వ మండలం నిడుమోలులో కార్మికులు, రైతుల ధర్నా

అన్నదాతల ఆగ్రహం

- జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా గ్రామీణ బంద్
- విజయవాడలో రైతుల భారీ ప్రదర్శన

దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె రెండు జిల్లాల్లోనూ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. పలు కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించగా, గ్రామాల్లోనూ రైతులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 6లో..

బెజవాడ
మేయర్ మారేనా..?

ఓడ మల్లన్న.. బోడి మల్లన్న.. సామెత చందంగా ఉంది పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తీరు. పశ్చిమలో తన వ్యాపకాల కోసం 2021 కార్పొరేషన్ ఎన్నికల అనంతరం ఎందరో ఆశావహులను పక్కనపెట్టి రాయన భాగ్యలక్ష్మికి మేయర్ పీఠాన్ని అప్పజెప్పిన ఆయన ఇప్పుడు సెంట్రల్‌లో తన సీటు నిలుపుకోవడం కోసం అదే మేయర్ సీటుకు ఎసరు పెడుతున్నారని తెలుస్తోంది. సెంట్రల్ నియోజకవర్గంలో బలంగా ఉన్న ‘అవుతు’ కుటుంబాన్ని తమవైపు తిప్పుకొనేందుకు మేయర్ మార్పు వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారన్న ఊహాగానాలు ఇప్పుడు నగరంలో చక్కర్లు కొడుతున్నాయి.

- రాయన భాగ్యలక్ష్మి అవుట్.. సీన్‌లోకి అవుతు శైలజారెడ్డి
- పశ్చిమలో పనైపోయింది.. ఇక సెంట్రల్ వైపు..
- ‘అవుతు’ కుటుంబాన్ని ఆకర్షించేందుకు లోపాయికారి ఒప్పందం
- ఆశావహులను కాదని.. సొంత ప్రయోజనాలకే పెద్దపీట







ఎన్నికల వేళ వెలంపల్లి మార్కు రాజకీయం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు రాజకీయానికి మరో భారీ వికెట్ బలికానుంది. తన సొంత లాభం కోసం మేయర్ రాయన భాగ్యలక్ష్మి సీటుకు ఎసరు పెట్టేందుకు వెలంపల్లి సిద్ధమవుతున్నారు. వెలంపల్లిని పశ్చిమ నుంచి సెంట్రల్ అభ్యర్థిగా బదిలీ చేసిన నేపథ్యంలో అక్కడి కేడర్ మొత్తాన్ని తన వెంట తీసుకెళ్లిన వెలంపల్లి తాజాగా సెంట్రల్‌లో కీలకంగా ఉన్న డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి సేవలను ఉపయోగించుకునేందుకు భాగ్యలక్ష్మి సీటుకు ఎసరు పెట్టనున్నారు.

తెరవెనుక పావులు

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 64 డివిజన్లకు గానూ 49 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్లు విజయం సాధించారు. ఆ సమయంలో పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు తన నియోజకవర్గం నుంచే మేయర్ అభ్యర్థి ఉండాలని పట్టుబట్టి రాయన భాగ్యలక్ష్మిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టారు. ఆమె పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 46వ డివిజన్‌లో గెలుపొందారు. అప్పట్లో మేయర్ సీటు కోసం సెంట్రల్ నియోజకవర్గంలోని 58వ డివిజన్ కార్పొరేటర్ అవుతు శైలజారెడ్డి, తూర్పు నియోజకవర్గంలోని 15వ డివిజన్ కార్పొరేటర్ బెల్లం దుర్గ పోటీ పడ్డారు. కుల సమీకరణాలు, వెలంపల్లి రాజకీయంతో చివరికి భాగ్యలక్ష్మికే ఆ భాగ్యం దక్కింది. మిగిలిన ఇద్దరికీ డిప్యూటీ మేయర్ పదవులతో సరిపెట్టారు. 2021, మార్చి 18న భాగ్యలక్ష్మి మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ఏడాది మార్చితో మూడేళ్ల పదవీకాలం పూర్తికానుంది. మరో రెండేళ్ల కాలానికి మేయర్ పీఠంపై అవుతు శైలజారెడ్డిని కూర్చోబెట్టే విధంగా వెలంపల్లి పావులు కదుపుతున్నారు.

ఇక పశ్చిమతో ఏం పని..?

వెలంపల్లికి ప్రస్తుతం పశ్చిమ నియోజకవర్గంతో పెద్దగా పనిలేదు. అక్కడి వైసీపీ కేడర్‌ను సెంట్రల్‌లో తిప్పుతున్నారు. వారికే డివిజన్ ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగించారు. దీంతో స్థానికంగా ఉండే కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు వెలంపల్లిపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ టికెట్ మల్లాదికి దక్కదని తెలిసినప్పటి నుంచి అవుతు శైలజారెడ్డి భర్త శ్రీనివాసరెడ్డి వైసీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. చివరికి వెలంపల్లి రాజకీయం ముందు ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ పరిస్థితుల్లో సెంట్రల్ నియోజకవర్గంలో బలమైన వర్గంగా ఉన్న అవుతు వర్గాన్ని మచ్చిక చేసుకునేందుకు వెలంపల్లి తన రాజకీయానికి పదును పెట్టారు. అవుతు శైలజారెడ్డిని చివరి రెండేళ్లు మేయర్ పీఠంపై కూర్చోబెట్టే బాధ్యత తనదని, తన గెలుపు కోసం పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆయన అవుతు కుటుంబంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ఒప్పందం ఫలితంగానే అవుతు కుటుంబం పూర్తిస్థాయిలో వెలంపల్లి వెనుక తిరుగుతున్నారని చెబుతున్నారు.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు

- ఇక నెల నెలా బిల్లు ..ప్రస్తుతం ప్రభుత్వమే చెల్లిస్తుందని చెబుతున్న అధికారులు
- భవిష్యత్తులో రైతులకు తలనొప్పులు ఖాయం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 16: మండలంలో కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించేస్తున్నారు. ఈ మీటర్లపై వైఎస్‌ఆర్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అని ముద్రించారు. ఉచితం అని ఉన్నప్పటికీ ఇకనుంచి ప్రతి నెలా రైతు వినియోగించిన కరెంటుకు బిల్లు రానుంది. అయితే ఈ బిల్లును ప్రభుత్వమే కడుతుందని, రైతులకు భారం కాదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో మీటర్లు బిగించిన తర్వాత ఒక్కో రైతుకు రూ 3,500 నుంచి రూ.5,000 వరకు బిల్లు వస్తుందని, భవిష్యత్తులో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేశాక రైతులు వ్యవసాయాన్ని వదులుకోవాల్సిన ఉపద్రవం దాపురిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు. ఉచిత విద్యుత్ అన్నప్పుడు అసలు మీటర్ల అవసరం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు.




తోట్లవల్లూరు లంకలో వ్యవసాయ మోటారు వద్ద మీటరు బిగిస్తున్న సిబ్బంది

వైఎస్‌ఆర్ ఆశయానికి తూట్లు

ఈ మీటర్ల బిగింపు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయానికి తూట్లు పొడవటమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రం మీటర్ల బిగింపును అంగీకరించలేదని, ఏపీప్రభుత్వమే అంగీకరించిందని సీపీఎం నేతలు చెబుతున్నారు.

5,200 మీటర్లు బిగిస్తున్నాం

తోట్లవల్లూరు మండలంలో 5,200 వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నామని, ప్రస్తుతం లంక పొలాల్లో బిగిస్తున్నట్టు మండల విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు.

గవర్నర్ కార్యక్రమంలో విద్యార్థుల అవస్థలు

- ఏర్పాట్లు సరిగా చేయకపోవడంతో ఎండకు తాళలేక, మంచినీళ్లు లేక, కింద కూర్చోలేక ఇబ్బందులు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 16: పట్టణంలో తిరంగా పార్క్ ప్రారంభించడానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేసిన సందర్భంగా కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి విద్యార్థులను భారీగా తరలించారు. ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులను వారి స్కూల్ బస్సుల్లో, ప్రభుత్వ బడుల విద్యార్థులను ఉపాధ్యాయులే ఆటోల్లో తీసుకునివచ్చారు. పలు స్కూళ్ల విద్యార్థులను సాంస్కృతిక కార్యక్రమాల కోసం పిలిచారు. కానీ సరైన ఏర్పాట్లు చేయలేదు. దీంతో వారు కిందే కూర్చొన్నారు. ఎండ మండిపోవటంతో వాటర్ బాటిళ్లు అరకొరగా ఇవ్వడం, స్నాక్స్ ఇవ్వకపోవడంతో అల్లాడిపోయారు. గవర్నర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడినా స్పందించలేదు. పురపాలక సంఘం సిబ్బంది గవర్నర్ వచ్చే దాకా ఏర్పాట్లు చేస్తూనే ఉన్నారు. గవర్నర్ అధికారిక కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పరస్పరం ప్రశంసించుకోవటం, అభివృద్ధి కార్యక్రమాలను ఏకరవు పెట్టటం కార్యక్రమస్ఫూర్తికి విరుద్ధంగా ఉందని పలువురు ఆక్షేపించారు.

వీఐపీ గ్యాలరీల్లో వైసీపీ కార్యకర్తలు

పురపాలక సంఘం వీఐపీ పాస్‌లు పాస్‌లు ఇచ్చినా వీఐపీ గ్యాలరీల్లో అధికార పార్టీ కార్యకర్తలు కూర్చున్నారు. దీంతో ప్రెస్ గ్యాలరీల్లోకి వీఐపీలు వచ్చారు. కుర్చీల్లో కూర్చొన్న విలేకరులను లేపి వీఐపీలను అధికార పార్టీ నేతలు కూర్చోబెట్టారు.



నేలపైనే కూర్చున్న విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శనకు వచ్చిన విద్యార్థికి తన బాటిల్‌తో నీళ్లు తాగిస్తున్న కానిస్టేబుల్



గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మె సందర్భంగా విజయవాడలో ర్యాలీ చేస్తున్న కార్మిక, రైతాంగ నేతలు

మోదీ ప్రభుత్వ ఓటమితోనే దేశానికి రక్ష

- కార్మిక, రైతాంగ నేతల వ్యాఖ్యలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 16: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిలువరించేందుకు మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని, అదే దేశానికి, ప్రజలకు రక్ష అని పలు కార్మిక, రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె సందర్భంగా శుక్రవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. అక్కడ నిర్వహించిన సభలో పలువురు రైతు, కార్మిక సంఘాల నేతలు మాట్లాడారు. "రైతు ఉద్యమం కారణంగా మూడు నల్ల చట్టాలను రద్దు చేసిన మోదీ ప్రభుత్వం, రైతాంగానికి ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించిన మోదీ ప్రభుత్వం ఆయన చేసిన సిఫార్సులను అమలు చేయడం లేదు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి బీజేపీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తోంది." అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు విమర్శించారు. "నూతన విద్యా విధానం పేరిట విద్యా వ్యవస్థను ధ్వంసం చేయాలని కేంద్రప్రభుత్వం చూస్తోంది. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లను తెచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజానీకం అల్లాడుతున్నా వాటిని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టలేదు." అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. బీజేపీని దానికి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.పొలారి పిలుపునిచ్చారు. సీఐటీయూ నేత కె.దుర్గారావు, పీడీఎస్‌యూ నేత ఎ.రవిచంద్ర, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, ఏఐ యూటీయూసీ నాయకులు కె.సుధీర్, దివాకర్, కార్మిక సంఘాల నేతలు పి.అజయ్‌కుమార్, సీహెచ్ బాబూరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఆర్.అజయ్‌కుమార్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో వేగంగా మూడో దశ రీసర్వే

వన్‌టౌన్, ఫిబ్రవరి 16: ఎన్టీఆర్ జిల్లాలో మూడో దశ రీ సర్వే కార్యక్రమం వేగంగా సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు. శుక్రవారం జవహర్‌రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 107 గ్రామాల్లో చేసిన సర్వేలో 1,44,640 సరిహద్దులు తేలాయన్నారు. 57 గ్రామాల్లో రాళ్లు పాతే కార్యక్రమం పూర్తైందని, ఈనెల 18లోగా మిగిలిన గ్రామాల్లో పూర్తి చేస్తామని తెలిపారు. జగనన్న భూరక్షలో 16 మండలాల్లో 300 గ్రామాల్లో మూడు దశల్లో రీసర్వే చేపట్టామని, డ్రోన్ సర్వే పూర్తయిందని, 102 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 13వ నోటిఫికేషన్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉపాధి పథకంలో 1,96,748 మందికి జాబ్‌కార్డులు అందించామన్నారు. కరువు మండలాలు గంపలగూడెం, తిరువూరులో 3,639 కుటుంబాలకు 26,681 మందికి జాబ్‌కార్డులు ఇచ్చి వంద రోజుల పని కల్పించామన్నారు. ఆరోగ్య సురక్షలో భాగంగా 195 గ్రామ, వార్డు సచివాలయాల్లో 587 వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. 82,942 మందికి వైద్యసేవలందించామన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 3215 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని 1585 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామని తెలిపారు. 120 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరమని గుర్తించామన్నారు. 99416 మందికి ఆరోగ్యశ్రీకార్డులు పంపిణీ చేశామని తెలిపారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్, సర్వే ల్యాండ్ రికార్డు అధికారి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్ష వాయిదా వేయాలి

- జేబీఎన్‌పీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీన నిర్వహించే గ్రూపు-2 పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని జై భారత్ నేషనల్ పార్టీ (జేబీఎన్‌పీ) అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ పరీక్ష సమయానికి బ్యాంక్ క్లర్క్ ఉద్యోగాల పరీక్ష ఉండడంతో అభ్యర్థులు సందిగ్ధంలో ఉన్నారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా క్లర్క్ మెయిన్స్ పరీక్షను 25వ తేదీన నిర్వహించడానికి షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. నిరుద్యోగులు ఆరేళ్లుగా గ్రూపు-2 పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారని, 2019 తర్వాత గ్రూపు-2 క్లర్క్ ఉద్యోగాల నోటిఫికేషన్ ఇప్పటికి వచ్చిందని, ఈ పరీక్షను వాయిదా వేయాలని కోరారు.

మోపిదేవిలో వృద్ధురాలి సజీవ దహనం

మోపిదేవి, ఫిబ్రవరి 16: పూరిగుడిసెకు ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని వృద్ధురాలు సజీవ దహనమైంది. ఈ సంఘటన మోపిదేవిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. మోపిదేవి నుంచి అవనిగడ్డ వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే పూరిగుడిసెలో కందుల సీతామహాలక్ష్మి(76) ఒంటరిగా నివసిస్తోంది. అనారోగ్యంతో లేవలేని స్థితిలో మంచంలోనే ఉన్న ఆమె బాగోగులను కుమారుడు ధర్మయ్య, కుమార్తె ఆదిలక్ష్మి చూస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో గుడిసెకు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుటుపక్కల వారు కేకలు వేసి మంటలు అదుపుచేయటానికి ప్రయత్నించినప్పటికీ గుడిసె పూర్తిగా దగ్ధమై సీతామహాలక్ష్మి సజీవ దహనమైంది. కుమార్తె, కుమారుడు దూరంగా ఉండటంతో వెంటనే అక్కడికి చేరుకోలేకపోయారు. వృద్ధురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్సై వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. డీఎస్పీ మురళీధర్ ఘటనా స్థలానికి పరిశీలించారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

1320 మందితో సూర్య నమస్కారాలు

- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సిఫారసు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యోగసభ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ కళాశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు, యోగ సాధకులతో కలిపి 1320 మంది సూర్య నమస్కారాలు చేశారు. కార్యక్రమాన్ని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఝాన్సీ సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని ధ్రువీకరించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సిఫారసు చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారుడు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు. గురువులు ఘంటసాల గురునాథబాబు, లక్ష్మి, మద్దాల చింతయ్య, రమేష్ సూర్య నమస్కారాల కార్యక్రమ నిర్వహణ చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధులు పాల్గొన్నారు.

గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు

మా బకాయిలు చెల్లించమనే అడుగుతున్నాం: ఏపీ జేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

- ఉద్యోగుల సొమ్మును పథకాల రూపంలో పంచడమేంటి?
- ఉద్యమ శంఖారావంలో ప్రభుత్వాన్ని బండి శ్రీనివాసరావు నిలదీత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): "ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించమని అడుగుతున్నారు. అవి సాధించుకోవటానికే ఉద్యమానికి దిగారు. ఐదేళ్లుగా దాచుకున్న డబ్బులు ఇవ్వండంటూ ప్రభుత్వాన్ని కోరుతూ ఆందోళన చేస్తున్నారు." అని ఏపీజేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉద్యమ శంఖారావంలో భాగంగా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఉద్యోగుల ఆవేదనతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఉద్యోగులు ఈ రోజున ఆకలి పోరాటం చేస్తున్నారని, ఏ ప్రభుత్వానికీ సహకరించని స్థాయిలో ఇప్పటివరకు ఈ ప్రభుత్వానికి ఉద్యోగులు వివిధ స్థాయిల్లో సహకరించారని ఆయన అన్నారు. ఉద్యోగులు తమ కుటుంబ అవసరాల కోసం వివిధ రూపాల్లో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోవటం వల్ల ఉద్యోగులను ఎగవేతదారులుగా ప్రకటించే దుస్థితి దాపురించిందన్నారు. నాలుగేళ్లుగా ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ప్రభుత్వం ఇవ్వటం లేదన్నారు.



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న బండి శ్రీనివాసరావు, జేఏసీ నేతలు



మచిలీపట్నం జడ్పీ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

27న 'చలో విజయవాడ'

నాలుగేళ్లుగా ఒక్క డీఏ కూడా ఇవ్వని ప్రభుత్వం ఇదేనని బండి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము దాచుకున్న సొమ్ములను పథకాల రూపంలో ప్రజలకు పంచడం సమంజసం కాదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రతి పీఆర్సీలోనూ జీతభత్యాల పెంపు ఉంటుందని ఈ ప్రభుత్వం పెంచకపోగా తగ్గించిందన్నారు. పదకొండో పీఆర్సీని పూర్తిగా లేకుండా చేసిందన్నారు. పన్నెండో పీఆర్సీ ఇస్తారనుకుంటే దాని అమలులోనే అనేక అవాంతరాలున్నాయన్నారు. ఇటీవల మంత్రుల బృందంతో జరిగిన చర్చల్లో 49 సమస్యలపై నివేదించామని, ఇప్పటి వరకు ఒక్క సమస్యకైనా ప్రభుత్వం పరిష్కారం చూపలేదన్నారు. ప్రభుత్వానికి ఈనెల 26వ తేదీ వరకు సమయం ఇస్తున్నామని, 27న చలో విజయవాడను భారీగా నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సిందే: ఎ.విద్యాసాగర్

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే సరైన సమయంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఏపీ జేఏసీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ ఎ.విద్యాసాగర్ హెచ్చరించారు. ఏ రాష్ట్రంలోనూ ఉద్యోగులకు ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి రాలేదన్నారు. ఎండీ ఇక్బాల్, హరినాథ్‌బాబు, శ్రీనివాసరావు, రవీంద్రబాబు, కిషోర్, శ్రీనివాసరావు, సాంబశివరావు, ఎం.రాజబాబు, జానీబాషా, రెడ్డమ్మ, శ్రీరామ్, సంపత్‌కుమార్, జి.నారాయణరావు, పి.రమేష్, సతీష్ కుమార్, విష్ణువర్ధనరావు, నజీర్, సీహెచ్ ప్రసాద్, మధుసూదన్ పాల్గొన్నారు.

డిమాండ్లు ఆమోదించే వరకు పోరాటం

మచిలీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఏపీ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, మధ్యంతర భృతిని విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ఏపీ జేఏసీ కృష్ణాసంఘం కార్యదర్శి ఆకునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేపట్టిన ఉద్యమబాటను అణచివేసేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ముందుకు సాగాలని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేవరకు పోరా టాన్ని దశలవారీగా కొనసాగించాలని జడ్పీ యూనిట్ ప్రతినిధి ఆర్.హేమప్రకాష్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు కె.ఆంజనేయులు సూచించారు. పెనమలూరు మండలం కానూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మోపిదేవిలో జేఏసీ నేతలు తహసీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు.

చింతలపూడి పూర్తి టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే సాధ్యం

- తల్లీ, చెల్లిని పట్టించుకోని దౌర్భాగ్యుడు మన సీఎం: కేశినేని చిన్ని

విస్సన్నపేట, ఫిబ్రవరి 16: మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా వరకు పూర్తి చేసిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతుల కలల్ని సాకారం చేసేది టీడీపీ - జనసేన ప్రభుత్వమే అని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కొండపర్వ మల్లయ్య, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆయన శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. "తల్లిని, చెల్లిని పట్టించుకోని దౌర్భాగ్యుడు మనకు సీఎం కావడం దౌర్భాగ్యం. టీడీపీలో ఉండి పదవులు అనుభవించిన ఇక్కడ ఇద్దరు నాయకులు వైసీపీ పంచన చేరారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగల్ల సుధారాణిని నందిగామలో జడ్పీటీసీగా గెలిపించి చైర్‌పర్సన్‌గా టీడీపీ చేసింది. అటువంటి పార్టీని వారు విమర్శించడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనం"అని చిన్ని విమర్శించారు. భారీ ర్యాలీతో విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్లో అభిమానులు భారీ గజమా లతో స్వాగతం పలికారు. టీడీపీ - జనసేన శ్రేణులు కలిసికట్టుగా పని చేసి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కొండపర్వ, విస్సన్నపేట, మారేమండ, నర్సాపురం గ్రామాలకు చెందిన వేలాది టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. శావల దేవదత్, మట్టా వేణుగోపాల్, వల్లభనేని గిరి, నెక్కళపు శ్రీనివాసరావు, రాజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశినేని చిన్ని

కాలుష్యం నిలువరించకుంటే ఉద్యమిస్తాం

- ఎన్టీటీపీఎస్ సీఈ నవీన్‌కుమార్‌కు టీడీపీ వినతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16: తమ సంస్థ నుంచి వెలువడుతున్న బూడిద కాలుష్యాన్ని తక్షణం నిలువరించకుంటే బాధిత ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమాన్ని చేస్తామని ఎన్టీటీపీఎస్ సీఈ నవీన్‌కుమార్‌కు టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఈమేరకు నేతలు శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. "40 ఏళ్ల దాటిన స్టేజ్-1, స్టేజ్-2 యూనిట్లు మూసివేసి తొలగించాలి. పాత చిన్ని(గొట్టాలు)ల నుంచి వచ్చే ఉద్గారాలను నియంత్రించేందుకు కెమికల్స్‌ను, నాణ్యమైన బొగ్గును ఉపయోగించాలి. ఆర్‌డబ్ల్యూఎస్ తీసుకునే ఇంటెక్ పంపుహౌస్ వద్ద బూడిద కలుస్తోంది. దాన్ని నిలువరించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలి. ప్రజలకు, పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలి. పర్యావరణ పరిరక్షణకు గ్రీనరీ ఏర్పాటు చేయాలి. యాష్ పాండ్ నుంచి బూడిద రవాణా సమయంలో వాహనాల నుంచి బూడిద కారకుండా చూడాలి." అని వినతిపత్రంలో పేర్కొన్నారు. టీడీపీ నేతలు చుట్టుకుదురు శ్రీనివాసరావు, చెన్నుబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, కరిమికొండ శ్రీలక్ష్మి, రావి ఫణి, బసవ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



సీఈ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు



యువతతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న వెనిగండ్ల రాము

టీడీపీ-జనసేన ప్రభుత్వమొచ్చాక 20 లక్షల ఉద్యోగాలిస్తాం

- గుడివాడ యువతతో ముఖాముఖిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము

గుడివాడ: టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 20లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలిస్తామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని ఆ పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము తెలిపారు. నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడమే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్‌లో గుడివాడ యువతతో గుడివాడ భవిత అనే అంశంపై ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. విమానాశ్రయానికి, పోర్టుకు అతి దగ్గరలో ఉన్న గుడివాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. రోడ్లు వేయడం, తాగునీరు అందించడం, మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల పని అని ఆయన స్పష్టం చేశారు. ఆక్వాకు కేంద్రంగా ఉన్న నియోజకవర్గంలో ఆక్వా యూనివర్సిటీ సాధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించానన్నారు. యువత అడిగిన ప్రశ్నలకు వెనిగండ్ల సమాధానమిచ్చారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.



పాతికేళ్ల కళాశాల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జి.సతీష్‌రెడ్డి, ఎస్‌ఆర్‌జీఈసీ యాజమాన్యం

భవిష్యత్‌లో అణురంగంలో అద్భుతశక్తిగా భారత్

- ఎస్‌ఆర్‌జీఈసీలో రజతోత్సవ ప్రారంభోత్సవంలో ది ఏరోనాటికల్ సొసైటీ ఫర్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 16: సమీప భవిష్యత్‌లో శాటిలైట్, అణురంగాల్లో అద్భుత శక్తిగా భారతదేశం మారనుందని ది ఏరోనాటికల్ సొసైటీ ఫర్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్.ఆర్.జి.ఇ.సి)లో రజతోత్సవ వేడుకలను ముఖ్య అతిథిగా విచ్చేసిన సతీష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విశిష్ట అతిథిగా రాష్ట్ర పూర్వ ఐటీ సలహాదారు త్రిపురనేని హనుమాన్‌చౌదరి విచ్చేశారు. దేశ భవిష్యత్ యువశక్తిపై ఆధారపడి ఉందని ఆయన పేర్కొన్నారు. కళాశాల పాతికేళ్ల ప్రస్థానంపై రూపొందించిన 25 సంవత్సరాల కళాశాల చరిత్ర అనే పుస్తకాన్ని సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్‌తో అష్టావధానం నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాలలు, సమాజంపై వాటి పాత్ర-అంతరాయం, విద్యా ప్రయోజనం అనే అంశాలపై ప్యానల్ డిస్కషన్ నిర్వహించారు. టెక్‌ఫెస్ట్ పేరిట వివిధ కంపెనీల నూతన ఆవిష్కరణల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కో-చైర్మన్ ముసునూరి శ్రీనివాసరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, సంస్థ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, ఉపాధ్యక్షులు కొడాలి వెంకట కృష్ణారావు, గవర్నింగ్ బాడీ సభ్యులు వల్లూరుపల్లి వెంకట్ కిరణ్, ముసునూరి శ్రీరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ పి.కోదండ రామారావు, ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారు పొట్లూరి రవీంద్రబాబు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ ప్రదర్శనతో జగన్‌రెడ్డికి వెన్నులో వణుకు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16: 34 వేల మంది రైతుల కష్టాలకు వాస్తవ రూపమైన రాజధాని ఫైల్స్ సినిమాను థియేటర్లలో ప్రదర్శిస్తుంటే సీఎం జగన్ రెడ్డికి వెన్నులోవణుకు పుట్టుకొచ్చిందని సినిమాను ప్రదర్శించకుండా కక్ష సాధింపు చర్యలకు దిగారని, ఇది దారుణమని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మచిలీపట్నం పార్లమెంటు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రాజధానుల పేరుతో దగా చేసిన సీఎం ఇప్పుడు ఓటమి భయంతో హైదరాబాద్‌ను రాజధాని చేద్దామంటున్నారని అన్నారు.

భయపడుతున్నావా..జగన్: నెట్టెం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 16: 34వేల మంది రైతుల త్యాగాలను ప్రతిబింబిస్తున్న రాజధాని ఫైల్స్ చిత్రాన్ని చూసి, ఓడిపోతానని భయపడుతున్నావా సీఎం జగన్ రెడ్డీ అంటూ టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఓటమి భయంతోనే సీఎం జగన్‌రెడ్డి సినిమాను అడ్డుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు పలికి మాట మార్చిన జగన్‌ను ప్రజలు క్షమించరన్నారు. విధ్వంసం తప్ప నిర్మాణం తెలియని సైకో సీఎం జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధమయ్యారని అన్నారు.

సినిమాను అడ్డుకునే నీచస్థితికి దిగజారిందీ ప్రభుత్వం: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 16: "రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చిన ఘనుడు, ఐదుకోట్ల ఆంధ్రుల కలల రాజధానిని ఛిద్రం చేసిన తుగ్లక్, మూడు రాజధానుల పేరుతో ఆంధ్రులను మోసం చేసిన మూర్ఖుడు సీఎం జగన్. రైతుల బతుకు చిత్రంపై సామాజిక బాధ్యతతో తీసిన సినిమా రాజధాని ఫైల్స్‌ను అడ్డుకునే నీచస్థితికి వైసీపీ ప్రభుత్వం దిగజారింది. సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడటం చరిత్రలో ఇదే తొలిసారి. ఈ సినిమా వల్ల జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏంటి?" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రైతుల ఉసురు పోసుకున్న జగన్ రాష్ట్ర ప్రజల కోసం తీసిన సినిమాను అడ్డుకోవడం దారుణమన్నారు.

భార్య కాపురానికి రాలేదని గొంతు కోసుకున్న భర్త

- 108లో ఆస్పత్రికి తరలింపు

ఎ.కొండూరు, ఫిబ్రవరి 16: భార్య కాపురానికి రావడంలేదని భర్త మనస్థాపంతో చాకుతో గొంతు కోసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అట్లప్రగడ గ్రామంలో జరిగింది. పెనుగంచిప్రోలు మండలం గట్టు భీమవరానికి చెందిన అల్లూరి శ్రీనివాస్‌కు ఎ.కొండూరు మండలం అట్లప్రగడ గ్రామానికి చెందిన గొల్లపూడి కృష్ణవేణికి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. ఇటీవల భార్య భర్తల మధ్య ఘర్షణ జరిగి కృష్ణవేణి తన పుట్టింటికి వచ్చింది. శుక్ర వారం శ్రీనివాస్ తన కుమార్తెను చూడడానికి అట్లప్రగడకు వచ్చాడు. ఫుల్లుగా మద్యం తాగి పెద్ద పెద్ద కేకలు వేస్తూ తలను రోడ్డుకు, హ్యాండ్ పంపునకు కొట్టుకుంటూ తన వెంట తెచుకొన్న చాకుతో గొంతు కోసుకున్నాడు. గ్రామస్థులు 108లో తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఏఎస్సై లక్ష్మి తెలిపారు.



తీవ్ర గాయాలతో అల్లూరి శ్రీనివాస్

యువకుడి వద్ద 112 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

- గుడివాడలో రెండు గృహాల్లో చోరీ చేసినవిగా గుర్తింపు
- నిందితుడిపై 22 చోరీ కేసులు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 16: గుడివాడ పెద్దకాలువ సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడి వద్ద 112గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ ఏసుబాబు తెలిపారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుడివాడలోని కొత్తపేటకు చెందిన ముద్దాని జగదీష్(24) పెద్దకాలువ సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా రూరల్ ఎస్సై లక్ష్మీనరసింహమూర్తి, పోలీసు సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని విచారణ జరపారని, అతని వద్ద 112 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్టు గుర్తించారని సీఐ తెలిపారు. వాటి విలువ రూ.6.72 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఆభరణాలను గుడివాడ లక్ష్మీనగర్‌కాలనీలో బి.అపర్ణ ఇంట్లో, టిడ్కో కాలనీలోని నందూరి శ్రీనివాసరావు ఇంట్లో జనవరి 17 జగదీష్ చోరీ చేశాడని నిర్ధారించామని ఆయన తెలిపారు. విజయవాడలో జగదీష్‌పై 22 చోరీ కేసులు ఉన్నాయని, జనవరి 4న సబ్ జైలు నుంచి విడుదలయ్యాడని తెలిపారు. రూరల్ ఎస్ఐ లక్ష్మీనరసింహమూర్తి, పోలీసు సిబ్బందిని అభినందిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 16 : మైనారిటీ తీరని పిల్లలకు వాహనాలిచ్చి ప్రమాదాలకు కారకులవ్వరాదని ఉయ్యూరు పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు సెంటర్‌లో శుక్రవారం వాహనాల తనిఖీ చేసి లైసెన్స్ లేని వారితోపాటు మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై గణేశ్

కేంద్ర చట్టాలు రైతులకు గొడ్డలిపెట్టు

సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ




హనుమాన్ జంక్షన్‌లో రైతు సంఘాల నిరసన, ఉయ్యూరులో ప్రజా సంఘాలు.. కంకిపాడు బస్టాండ్ సెంటర్‌లో..

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 16 : ఆరుగాలం కష్టపడి ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్న రైతులకు గొడ్డలిపెట్టుగా మారిన విద్యుత్ సవరణ చట్టాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాలు ఐక్యవేదిక ఇచ్చిన గ్రామీణ భారత్‌బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం హనుమాన్‌జంక్షన్‌లో రైతు సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, తెలుగు రైతు రాష్ట్ర నాయకులు గుండపనేని ఉమావర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, దయాల రాజేశ్వరరావు, జేత శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు, పుట్టా సురేష్, అట్లూరి శ్రీనివాసరావు, మొవ్వా వేణుగోపాల్, కలపాల రాధాకృష్ణ, పుసులూరు లక్ష్మీనారాయణ, గార్లపాటి రాజేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, మండాడి రవీంద్ర, తోట సాంబశివరావు, జె.ఏసుపాదం పాల్గొన్నారు.

బండారుగూడెంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బండారుగూడెంలో శుక్రవారం గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా సచివాలయం, స్కూళ్లను మూసివేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు బర్రె లెనిన్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండేటి నాగరాజు, నువ్వుల జయరాజు, రైతు నాయకులు కొండేటి ఏసుబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఉంగుటూరు సెంటర్లో ..

మతోన్మాద బీజేపీని ఓడించాలి


గన్నవరంలో నిరసన

గన్నవరం: కేంద్రంలోని బీజేపీ మతోన్మాద, ప్రజావ్యతిరేక పార్టీని ఓడించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు అన్నారు. రైతాంగానికి తీవ్ర నష్టదాయకమైన నల్ల చట్టాలను రద్దుచేయాలని కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం గన్నవరంలో నిరసన ప్రదర్శన చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, మల్లంపల్లి జయమ్మ, అను మోలు వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి, మిరప నాగేశ్వరరావు, అవుటపల్లి సాంబయ్య, సర్దార్, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు సెంటర్లో నిరసన

ఉంగుటూరు : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉంగుటూరులో నిర్వహించిన గ్రామీణ బంద్ విజయ వంతమైంది. జాతీయ కర్షక, కార్మిక సంఘాల సమితి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఉంగుటూరు సెంటర్లో రైతు, కార్మిక సంఘాల నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు రైతు, కార్మిక సంఘాల నేతలు సుబ్బారెడ్డి, సింహాచలం, సత్యనారాయణ, సుందరం, శ్రీరాములు, పారినాయుడు పాల్గొన్నారు.

మాట తప్పిన ప్రభుత్వాన్ని గద్దెదించాలి


పోరంకిలో ప్రజాసంఘాల నిరసన

పెనమలూరు : రైతులకు మాట ఇచ్చి తప్పిన మోదీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దెదించాలని వామపక్షాల, కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం రైతులకు, రైతు కూలీలకు సంఘీభావంగా దేశవ్యాప్త బంద్‌లో భాగంగా పెనమలూరు మండలం పోరంకి సెంటరు నుంచి తాడిగడప సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి వెలగపూడి అజాద్, సీఐటీయూ నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, కాంగ్రెస్ నాయకులు కిలారు వెంకటరత్నం, సీపీఎం నాయకులు ఎస్కే కాసిం, సీపీఐ నాయకులు మున్నంగి నరసింహారావు, ఆరికట్ల సురేష్, మాదు నాగేశ్వరరావు, వెలిసెల సుబ్రహ్మణ్యం, లక్ష్మీప్రసన్న, గంటా మహేష్, పుసులూరి పాతాళలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలి

కంకిపాడు : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్ అన్నారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా కంకిపాడు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ టీయూ, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయ కులు జె. రవి, ఎం. చంటి, పి. దుర్గారావు, వై. జోజి, కె. మురళి, వేమూరి నాగేశ్వరరావు, కె. నాంచారయ్య, పి. నాగేశ్వరరావు, ఎండి కాన్, ఆర్ సత్యవతి, సాంబయ్య పాల్గొన్నారు.

ప్రజాసంఘాల నిరసన

ఉయ్యూరు : స్వామినాథన్ సిఫార్సులతోపాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతులు చేస్తున్న ఆందోళనపై కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉయ్యూరులో శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. కె శివ నాగేంద్రం, అన్నే సుబ్బారావు, బీ రాజేశ్, కీర్తి, నాగమణి, ఇస్మాయిల్, నాంచారయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 16 : టీడీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీకి బీసీలు వెన్నెముకగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెనమలూరు గౌడ, రజక బజారుల్లో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టీడీపీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల వల్లే బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా నిలదొక్కుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుపూడి ధన కోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు, తోటకూర ఉదయభాస్కర్, మోర్ల నరేంద్ర, మరీదు శంకర్, షేక్ సైదులు, బుజ్జి, సుబాని, మణికంఠ, మరీదు జిత్తు, రాజేష్, వెంకట సుబ్బారావు, బలరామ్ పాల్గొన్నారు.


పెనమలూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బోడె ప్రసాద్

యనమలకుదురులో..

ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఏర్పడేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని బోడె సతీమణి హేమ, జనసేన తాడిగడప అధ్యక్షుడు తాతపూడి గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం యనమలకుదురు మంటపం సెంటరు నుంచి చినవంతెన వరకు టీడీపీ జనసేన నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలను ఐదేళ్లుగా దోచుకుతిని, పైగా వేధింపులకు గురి చేసిన సైకో జగన్‌ను రాష్ట్ర ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, కిరిమికొండ బాబు, గొల్లా శ్రీను, మాదాసు రాము, గంధం సురేష్, తుమ్మల రాంకుమార్, తమ్ము అశోక్, ఇబ్రహీం, వీరంకి కుటుంబరావు, అంగిరేకుల మురళి, సంపర శేఖర్ పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ పురేంద్ర


వైద్యశిబిరంలో రక్త పరీక్ష చేయించుకుంటున్న డీటీసీ పురేంద్ర

గన్నవరం, ఫిబ్రవరి 16 : డ్రైవర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ ఎం.పురేంద్ర అన్నారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వాహన పటుత్వ కేంద్రం వద్ద రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ, వాహనాలు నడిపే సమయంలో రహదారి భద్రత ఎంత ముఖ్యమో అలానే డ్రైవర్ ఆరోగ్యం కూడా చూసుకోవాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వాహనాలు నడిపినా ప్రమాదాలు జరుగుతాయన్నారు. డ్రైవర్లకు అప్రమత్తత అవసరమన్నారు. రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వరుణ్ హెల్త్ సెంటర్, సంధ్య కంటి ఆస్పత్రి వైద్యులు బీపీ, షుగర్, కంటి, ఈసీజీ, జనరల్ పరీక్షలు జరిపారు. ఎఫ్‌సీ సెంటర్ ఇన్‌చార్జి ఆర్ ప్రవీణ్, వైద్యులు ఎస్ తేజసాయి కిరణ్, డబ్ల్యు రాజరత్న, ఎస్.ప్రతాప్, కశీరాజు వైద్య సేవలందించగా ఎంవీఐలు డీవీ రమణ, జీవిఎస్ఎన్ మూర్తి, ఉదయ్ శివ ప్రసాద్, కె.శివరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హామీలపై అడుగుదాం ఆంధ్రా

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్


అడుగుదాం ఆంధ్రా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, ఫిబ్రవరి 16 : రాష్ట్రంలో ప్రజా సమస్యలు దారిమళ్లించేందుకు ఐదు సంవత్సరాల కాలంలో ఎన్నడు లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఆడుదాం ఆంధ్ర నిర్వహించి మరోసారి మోసం చేయడాన్ని తెలుగు యువత ఆధ్వర్యంలో అడుగుదాం ఆంధ్రాగా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉయ్యూరులో నిర్వహించనున్న అడుగుదాం ఆంధ్రా బహిరంగ సభ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, జంపన వీరశ్రీనివాస్, రాజుపాటి ఫణి, పలియాల శ్రీనివాస్, ఫైదయ్య, బూరెల నరేశ్, భాస్కర్, అజ్మతుల్లా, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీ కార్యాయంలో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

శాంతి భద్రతలు కాపాడాలి

● టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి ఇంటిపైకి దాడికి వచ్చిన వారిని కఠినంగా శిక్షించాలి
● డీఎస్పీ కార్యాలయంలో టీడీపీ నాయకులు ఫిర్యాదు

గన్నవరం, ఫిబ్రవరి 16 : ఉంగుటూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఈడ్పుగంటి కృష్ణమూర్తి ఇంటిపై అర్ధరాత్రి దాడికి వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ కార్యాయంలో టీడీపీ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రోద్బలంతో 76 ఏళ్ల వృద్ధుడైన కృష్ణమూర్తి ఇంటి తలుపులు బాది, అసభ్యంగా తిడుతూ భయభ్రాంతులకు గురి చేసిన వారిని అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన జరిగిన తర్వాత ఉంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా, ఏఎస్సై సత్తార్, పోలీస్ సిబ్బంది అక్రమంగా కృష్ణమూర్తి ఇంటిని చుట్టుముట్టి లోపలికి ప్రవేశించి సోదాలు నిర్వహించారని, కృష్ణమూర్తిని, ఆయన భార్యను మూడు నెలలు గ్రామం వదిలి వెళ్లిపోవాలని ఏఎస్సై హెచ్చరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై సుమారు 16 తప్పుడు కేసులు 250మంది నాయకులపై పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే తన వద్దనున్న ఎస్సీ నాయకులను అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులపై 8 ఎస్సీ, ఎస్టీ కేసులు అక్రమంగా పెట్టి వారిని మానసికంగా హింసిస్తున్నారని మహిళ నాయకులపై కూడా 307, ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించారని ఫిర్యాదులో తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా ఉంగుటూరు మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, కార్యదర్శి ఆళ్ల హనోక్, మేడేపల్లి రమ, మండవ రమ్యకృష్ణ, ఈశ్వర్, గుండపనేని నాని, యనమదల సతీష్, బెజవాడ నాగేశ్వరరావు, కుందేటి చంద్ర శేఖర్, నాగబాబు, రామ్‌కిరణ్, పోతినేని రామకృష్ణ, ధారం విజయ్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, ఫిబ్రవరి 16 : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపు గూడెం, కట్టుపడిపాలెం, ముదిరాజుపాలెం, వీఎన్‌పురం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడులోని కృష్ణనగర్, గుడివాడ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం ఏరియా, రైల్వేస్టేషన్, ఇందిరానగర్, ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

23న లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణోత్సవం

గన్నవరం, ఫిబ్రవరి 16 : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 23న జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో కలసి లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. కమిటీ కార్యదర్శి కాస న్నేని వెంకటేశ్వరరావు, కోశాధికారి జాస్తి ఫణిశేఖర్, మోదుగుమూడి వేణు, చిమట శ్రీనివాసరావు, పోట్ల శివలీల, జాస్తి శ్రీనివాసరావు, కాసన్నేని చిన్న నాని పాల్గొన్నారు.

సినిమాను అడ్డుకోవటం దారుణం

గన్నవరం, ఫిబ్రవరి 16 : రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులను వెలుగులోకి తెస్తూ రాజధాని ఫైల్స్ సినిమా నిర్మిస్తే విడుదల కాకుండా ప్రభుత్వం అడ్డుకోవటం దారుణమని గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రజలకు మేలు చేయలేని ఈ ప్రభుత్వం చివరకు సినిమాలను కూడా అడ్డుకునే స్థితికి చేరుకుందన్నారు. 34వేల మంది రైతుల త్యాగాలకు ప్రతిరూపంగా రాజధాని ఫైల్స్ సినిమా ఉందన్నారు.

పెనమలూరు : రాజధాని రైతుల వెతలపై రైతుబిడ్డ అయిన ఒక నిర్మాత సినిమా నిర్మిస్తే సైకో జగన్‌కు వెన్నులో వణుకు ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శించారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల నిరసన


పెనమలూరు, ఫిబ్రవరి 16 : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక జేఏసీ పిలుపు మేరకు కానూరు ఉన్నత పాఠశాలలో అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. రెడ్డమ్మ నేతృత్వంలో ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలంటూ చేపట్టిన నిరసన కార్యక్రమాలు రెండో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇనయతుల్లా, వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, పూర్ణచంద్రరావు, అబ్రహాం, శ్రీనివాస్, నారగని రాంబాబు, ప్రసాద్, అరుణ, లలిత, బేబీ పద్మజ, శమంతకమణి, పరిమళ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఉద్యోగులకు పాదయాత్రలో ఇచ్చిన హామీలను విస్మరించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దారుణంగా మోసం చేశారని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ ఐక్యవేదిక జేఏసీ నాయకులు ఆరోపించారు. డిమాండ్ల సాధన, సమస్యల పరి ష్కారం కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన దశలవారి ఉద్యమంలో భాగంగా ఏపీఎన్ జీఓస్ ఉయ్యూరు యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఎదుట భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 16 : సనాతన ధర్మ పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని సమరసత సేవా ఫౌం డేషన్ గన్నవరం సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండు రంగారావు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లంకప ల్లి గ్రామశివారు ఓంద్రంపాడులోని ఆంజనేయస్వామిగుడి ఆవరణలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం ధర్మనిధి, సామూహిక కుంకుమపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా: డీఎస్పీ


కానుమోలులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జయసూర్య

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 16 : ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, సమస్యాత్మక గ్రామాలతో పాటు పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ జయసూర్య సూచించారు. కానుమోలు, దంటగుంట్ల, కాకులపాడు, తిప్పనగుంట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను, పరిసరాలను ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, సీఐ నరసింహమూర్తితో కలిసి ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీల్లో ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, సీఐ నరసింహమూర్తి, ఎస్సై జనార్దన్, అర్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు కంప్యూటర్ అందజేత

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 16 : స్థానిక అప్పనవీడు జడ్పీ హైస్కూల్‌కు మానవత హనుమాన్‌జంక్షన్‌శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న బొమ్ములూరు గ్రామానికి చెందిన నందిగం శ్రీనివాసరావు, గాయత్రీ దంపతులు రూ.80 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను శుక్రవారం అందజేశారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా పాఠశాల హెచ్‌ఎం పుష్పావతికి అందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

వైభవంగా రథసప్తమి



సూర్యనారాయణస్వామికి విశేష పూజలు, పక్కన శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్ : రథసప్తమి సందర్భంగా వేకనూరులో సూర్యనారాయణ స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శాంతి కల్యాణం జరిపారు. ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిర దంపతులు పర్యవేక్షించగా, వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భారీ అన్నసమారాధన, స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఈవో చక్రధరరావు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వసంతోత్సవం

మోపిదేవి : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచమృత స్నపన, నిత్యహోమం అర్చక బృందం నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు చేసి, రంగులు చల్లుకుంటూ వసంతోత్సవం సంప్రదాయబద్ధంగా జరిపారు. ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్ఛరణ నడుమ మహాపూర్ణాహుతి సమర్పించారు. ఎస్టేట్ దేవాలయాల ఉద్యోగులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



శాస్త్రోక్తంగా వేద విద్వత్ సభ

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద విద్వత్ సభ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది చతుర్వేద పండితులు వేద ఘోష నిర్వహించారు. వేదాలు వర్ధిల్లిన ప్రాంతంలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని వేదపండితులు తెలిపారు. అనంతరం వేదపండితులను నూతన వస్త్రాలతో ఆలయ కార్యనిర్వహణాధికారి సత్కరించారు.



వైభవంగా భావనారుషి స్వామి కల్యాణం

పెడన : పద్మశాలీయుల ఇలవేల్పు భావనారుషి స్వామి సంబరాలలో భాగంగా శుక్రవారం భద్రావతీ సమేత భావనారుషి స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. నందం దుర్గావెంకట కోటేశ్వరరావు (నాని), శివపార్వతి దంపతులచే ఐలూరి జయకిషోర్ కల్యాణం జరిపించారు. దేవస్థానం ఆవరణలో 15 వేల మందికి అన్న సమారాధన చేశారు. అనుముల పూర్ణచంద్రరావు, నందం చినబాబు, అనుముల పెదపూర్ణచంద్రరావు, దుడుగు రామ్మోహన్, కొసనం సత్యనారాయణ, ఆకురాతి జనార్ధన్, నందం సోమనాథ్, చిలుకోటి గోవిందు, జక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కోడూరు సెంటర్‌లో వామపక్షాల నిరసన ప్రదర్శన



గుడివాడలో కార్మిక సంఘాల ర్యాలీ



చల్లపల్లి ప్రధాన సెంటర్లో ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు

పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలి

● కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన వెల్లువ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపుమేరకు గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా వివిధ పార్టీల నేతలు శుక్రవారం కోనేరుసెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం, సీపీఐ, రైతు కూలీ సంఘం, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలంటూ నిర్వహిస్తున్న సమ్మెకు ఎల్ఐసీ ఉద్యోగులు మద్దతు తెలిపారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జె. సుధాకర్, కార్యదర్శి కిషోర్‌కుమార్ నేతృత్వంలో బందరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. టి. చంద్రపాల్, రాజశేఖర్, ఠాగూర్, మాథూర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలనీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.పోలినాయుడు డిమాండ్ చేశారు. చల్లపల్లి ప్రధాన సెంటర్లో ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలనీ, రూ.600 కూలీ ఇవ్వాలనీ, కనీస పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలనీ, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రైతాంగ పోరాటంలో చనిపోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, మహమ్మద్ కరీముల్లా, ఎంఎల్ నేతలు జన్ను జగన్, పరుచూరి జనార్ధన్, రైతుసంఘం నేత అల్లూరి బాబూరావు, కాంగ్రెస్ నేత మీర్ రిజ్వాన్, చోడాబత్తిన ఆదినారాయణ, కార్మికసంఘాల నేతలు పాల్గొన్నారు. **కోడూరు :** రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండ దుర్గారావు డిమాండ్ చేశారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు రైతులకు ఇచ్చిన హామీలు, కార్మిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నేతలు నరసింహారావు, పోలాబత్తిన మోహనరావు, కోట వీరయ్య, బత్తిన రాజగోపాల్, రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, రేపల్లె యోగప్రకాష్, వెంకట కృష్ణారావు, రామకృష్ణరాజు తదిరతులు పాల్గొన్నారు. **కూచిపూడి :** రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ బంద్‌లో భాగంగా నిడుమోలులో కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. శీలం నారాయణరావు, బసవయ్య, కాకి రాజశేఖర్, ఏనుగు శ్రీనివాసరావు, చందోలు నాగేశ్వరరావు, బొల్లా సుబ్రహ్మణ్యం, వడ్డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** రైతు, కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా శుక్రవారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నాగాయలంకలో ర్యాలీ నిర్వహించారు. రైతుల సమస్యలను కేంద్రం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తలశిల లీలా మనోహర్, పరుచూరి రాఘవేంద్రరావు, తండు సూరిబాబు, పులి శ్రీనివాసరావు, తమ్మన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** సహజ వనరులను సైతం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌ల పరం చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీని సాగనంపే సమయం ఆసన్నమైందని వామపక్ష నాయకులు అన్నారు. వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో ఏవో బాలాజీకి వినతిపత్రం అందజేశారు. వామపక్ష నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గూడపాటి ప్రకాష్ బాబు, తెలుగురైతు విభాగం రాష్ట్ర నాయకులు చల్లగుళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు, లారీ అసోసియేషన్ నాయకులు గుత్తా చంటి, కార్మిక సంఘాల నాయకులు టి.లక్ష్మణరావు, రేపాని కొండ, అరుణ, జోన్స్, వీరమ్మ, రజిని, చింతలూరి సత్యనారాయణ పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా శుక్రవారం తోట్లవల్లూరులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రకాశరావు, కొండలుబాబు, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కోడూరు సెంటర్‌లో వామపక్షాల నిరసన ప్రదర్శన



తోట్లవల్లూరులో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

పోలింగ్ శాతం పెంపునకు రాజకీయ పార్టీలు సహకరించాలి : కలెక్టర్

మచిలీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపునకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. తన చాంబరులో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. జనవరి 22వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తరువాత జిల్లాలో ఓటుహక్కు కోసం 21,800 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో ఇప్పటి వరకు 9,612 దరఖాస్తులను పరిశీలన చేసి 8,603 ఆమోదించడం జరిగిందన్నారు. ఇంకా 12,268 దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయన్నారు. ఓటర్లు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నదీ, లేనిదీ పరిశీలన చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల నాయకులు తమ వంతు సహకారం అందించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసే తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరరావు, వైసీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం ప్రతినిధులు షేక్ సలార్‌దాదా, దిలీప్‌కుమార్, ఎస్.యశ్వంత్, బత్తిన దాసు, పంతం గజేంద్రరావు, అబ్దుల్ మతీన్, కొడాలి శర్మ తదితరులు పాల్గొన్నారు.



పల్లెతాళ్లపాలెంలో మాట్లాడుతున్న కొల్లు నీలిమ



నందివాడలో మహిళలతో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము, రావి



యలమర్రు పల్లెబాటలో పాల్గొన్న వర్ల కుమార్ రాజా

మహిళల కన్నెర్రతో జగన్ ప్రభుత్వం గల్లంతే

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 : మహిళలు కన్నెర్ర చేస్తే వైసీపీ ప్రభుత్వం గల్లంతేనని కొల్లు నీలిమ అన్నారు. పల్లెతాళ్లపాలెం, సత్రవపాలెం గ్రామాల్లో శుక్రవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో నీలిమ విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. లంకే శేషగిరి, లంకే నారాయణ ప్రసాద్, మోకా రాజు, బొడ్డు శ్రీనివాస్, తిరుమాని నారాయణ, కొనకళ్ళ నాగరాజు, కొక్కిలిగడ్డ జయకృష్ణ, చక్కా గోవిందరాజులు, కర్రి వెంకటనారాయణ పాల్గొన్నారు. **నందివాడ :** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము పేర్కొన్నారు. నందివాడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, వెనిగండ్ల రాము, టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మండల పార్టీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. గౌడపాలెం, రజకులపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పల్లెబాట నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీకి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. చలసాని రమేష్ చౌదరి, సూరపనేని వెంకట సత్యనారాయణ, రవికుమార్, సుబ్బయ్య, దానబోయిన వెంకట నారాయణ, ఆంజనేయులు, చెరుకూరి రమేష్, మసిముక్కు రాంబాబు, రమణబాబు, సజ్జ శివకుమార్, గుండపనేని శ్రీనివాసరావు, చప్పిడి కిషోర్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ దుర్గా రమేష్ మృతి



అవనిగడ్డ : అవనిగడ్డ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుడిసేవ దుర్గా రమేష్ (59) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. అవనిగడ్డ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకునిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన దుర్గా రమేష్ ఆ తర్వాత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. గురువారం అస్వస్థతకు గురి కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆసుపత్రిలో ఆయన మృతి చెందారు. దుర్గా రమేష్ మృతికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.వి. నరసింహారావు, అధ్యాపకులు అన్నపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అడుగుదాం ఆంధ్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బంటుమిల్లి : ఈనెల 25వ తేదీన ఆదివారం ఉయ్యూరులో జరిగే అడుగుదాం ఆంధ్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. అడుగుదాం ఆంధ్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. దండమూడి చౌదరి, మునగాల భాస్కర్, వలవల తాతాజీ, వీరబాబు, బొర్రా కాశీ, సతీష్, అంగర రంగనాథ్, యిల్లూరి లీలాకృష్ణ, ఆకుల రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలి జనార్దనరావుకు నివాళి

నాగాయలంక : ఆరు దశాబ్దాలపాటు భావదేవరపల్లికి మండలి జనార్ధనరావు నిస్వార్థంగా సేవలందించారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆయన 88వ జయంతి సందర్భంగా భావదేవరపల్లిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామసర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఆయన అభిమానులు పాల్గొన్నారు.



పెడన వీఆర్వోల సంఘం కార్యవర్గం

పెడన రూరల్ : మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా పరసా గోవిందరాజు, కార్యదర్శిగా షాకీరుల్లా ఎన్నికయ్యారు. జిల్లా జాయింట్ కార్యదర్శి యండి మౌలాలి అధ్యక్షతన కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా కట్టా వీరబాబు, గౌరవాధ్యక్షులుగా రుద్ర గణేశ్వరరావు, సహాయకార్యదర్శిగా అంకాలరావు, కోశాధికారిగా వీరభద్రం, సభ్యులుగా పార్వతి, రత్నకుమారి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీని తాహసీల్దార్ రాంబాబు, డీటీ పూర్ణచంద్రరావు, ఆర్ఐ మణికుమార్, ప్రసాద్, ఏసుపాదం, వెంకటేశ్వరరావు అభినందించారు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కూచిపూడి : ఆన్‌లైన్, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పామర్రు సీఐ శుభాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపోయిన వ్యక్తులు 24 గంటల్లో ఆన్‌లైన్‌లో గానీ, సంబంధిత పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన వంతెన

మోపిదేవి : రావివారిపాలెంలోని నూకాలమ్మ ఆలయం 11/1 బ్రాంచి కాలువపై వంతెన శుక్రవారం కూలింది. భారీ లోడుతో ఇసుక టిప్పర్ వంతెన దాటుతుండగా, ఒక్కసారిగా కూలి పోయింది. త్వరితగతిన వంతెన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఫైరింగ్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి : ఎస్పీ

మచిలీపట్నం,ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ఫైరింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ అన్నారు. మంగినపూడి బీచ్ సమీపంలో పోలీస్‌ఫైరింగ్ రేంజ్‌లో ఏఆర్ పోలీసులకు ఫైరింగ్‌లో శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. నూతన ఆయుధాలను ఉపయోగించడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మెలకువలు నేర్చుకోవాలని సూచించారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా

మచిలీపట్నం టౌన్ : పోలీసు సిబ్బంది న్యాయమైన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ అన్నారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. పోలీసులు, హోం గార్డులు తమ సమస్యలను ఎస్పీకి తెలిపారు. ప్రతి శుక్రవారం పోలీసుల సమస్యలు తెలుసుకుంటామన్నారు.

అంగలూరులో అభివృద్ధి పనులకు త్రిపురనేని శంకుస్థాపన

గుడ్లవల్లేరు : అంగలూరు దళితవాడలో రామాలయం ప్రహరీ నిర్మాణానికి, పంచాయతీ కార్యాలయంలో వేదిక నిర్మాణానికి శుక్రవారం త్రిపురనేని హనుమాన్ చౌదరి శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాలకు ఆయన రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నారు. అనంతరం అంగలూరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో నేటి ఆధునికత అంశంపై ఆయన సమావేశం నిర్వహించారు. ది ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్ రెడ్డి నలందా విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్స్‌లర్ సునైనా సింగ్, అంగలూరు సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, వైస్ సర్పంచ్ త్రిపురనేని సురేష్, దుగ్గిరాల శేషుబాబు, విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ ఎం.వి.జె.ఆంజనేయులు, యంగ్ హార్ట్స్ ప్రతినిధి హితేష్ పాల్గొన్నారు.